నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | RANGAREDDY

'అమ్మ ఆదర్శ' పనులపై
ప్రత్యేక నిఘా

పనుల నాణ్యత పరిశీలనకు ప్రత్యేకాధికారులకు బాధ్యతలు

ఇప్పటివరకు 202 స్కూళ్లలో పనులు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 929 స్కూళ్లను ఎంపిక చేసిన విద్యాశాఖ

'మన ఊరు-మన బడి' స్కూళ్లను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వం

వికారాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులను కల్పించే పనులపై జిల్లా ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకుగాను చేసిన అంచనాలు, ఎంబీ రికార్డులకు పొంతన లేకపోవడంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అంతేకాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కింద పూర్తి చేసిన పనుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు గుర్తించిన జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించింది. అందుకోసం ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించగా.. వారు నేటి నుంచి స్కూళ్లవారీగా పనులు పరిశీలించనున్నారు. ఇంకా పలు పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల వేగవంతంపై పలు మార్లు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోవడంతో కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్లక్ష్యం మానుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద 929 స్కూళ్లను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 202 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. 'మన ఊరు-మన బడి' కింద 12 రకాల మౌలిక వసతులను కల్పించేలా కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగైదు వసతులు మాత్రమే కల్పిస్తున్నది.

నామమాత్రంగా పనులు...

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'మన ఊరు-మన బడి' స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. కేసీఆర్ సర్కార్ తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, విద్యుత్తు, గ్రీన్ చాక్‌బోర్డులు, పెయింటింగ్, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్డుల నిర్మాణం, శిథిలమైన తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, డిజిటల్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు తదితర వసతులు అందుబాటులోకి తీసుకురాగా.. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కింద కేవలం తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులకు మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం స్కూళ్లలో కల్పిస్తున్నది. గతంలో 'మన ఊరు-మన బడి'లో బడికి ఎంపికై 20-50 శాతం పనులు పూర్తైన స్కూళ్లను కాకుండా.. కొత్త స్కూళ్లను ఎంపిక చేశారు. ఇప్పటికే కొంతమేర పనులు పూర్తైన స్కూళ్లలోనే పనులు చేపట్టాలనే అభిప్రాయం వ్యక్తమయినప్పటికీ పట్టించుకోవడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే 'మన ఊరు-మన బడి' స్కూళ్లలోని అసంపూర్తి పనులను పూర్తి చేయడం లేదని సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

పెండింగ్‌లోనే రూ.8 కోట్ల చెల్లింపులు..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పూర్తైన పనులకు సంబంధించి చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ఆరు నెలలుగా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా.. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం గమనార్హం. స్కూల్ కమిటీలు, సంబంధిత అధికారులపై ఒత్తిడితో పలు స్కూళ్లలో పనులు పూర్తి చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పనులు పూర్తి చేసిన వారిలో చాలావరకు స్కూల్ కమిటీ సభ్యులే ఉన్నారు. వారు అప్పులు చేసి పనులు పూర్తి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు-మన బడిలో పూర్తైన పనులకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి అందజేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు సైతం సంబంధిత బిల్లుల విషయంలో చేతులెత్తేస్తున్నారు. మరోవైపు పనులు పూర్తై నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పనులు పూర్తి చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడుతలో 371 స్కూళ్లను 'మన ఊరు-మన బడి'కి ఎంపిక చేయగా, 20 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. ఇక సుమారు 300 స్కూళ్లలో పనులు 20-50 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సంబంధిత పనులకు సంబంధించి రూ.8 కోట్ల చెల్లింపులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది.

● నిబంధనల 'దారి' తప్పి..

మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం బాచుపల్లిలోని కోకాకోలా యూటర్న్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మియాపూర్, గండిమైసమ్మ ప్రధాన రహదారిలో రాంగ్‌రూట్‌లో వస్తున్న 30 వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. -దుండిగల్

చెరువుకు చేరని చేపలు

చేప పిల్లల పంపిణీ టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం

ఇప్పటికే రెండు సార్లు టెండర్లు పిలిచినా ముందుకు రాని గుత్తేదార్లు

ఈ నెల 13 వరకు గడువు పెంపు.. మూడోసారి అయినా ముడిపడేనా..!

ఈ ఏడాది 813 చెరువుల్లో 1.93కోట్ల చేప పిల్లల పెంపకానికి చర్యలు

చేపల పంపిణీ జాప్యంతో ఈ ఏడాది ఉపాధి అవకాశాలపై ఆందోళన చెందుతున్న మత్స్యకార్మికులు

రంగారెడ్డి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంతో మత్స్యకార్మిక కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఏటా ఏప్రిల్ మాసంలోనే టెండర్ల ప్రక్రియను చేపడుతుండగా.. ఈసారి ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. ఇప్పటికే రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ గుత్తేదార్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం ఈ నెల 13 వరకు గడువు పెంచింది. చెరువుల్లో చేప పిల్లల విడుదలకు సమయం ఆసన్నమవుతుండగా.. ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తుండడంతో జిల్లాలో చేపల విక్రయాలతోనే ఉపాధి పొందుతున్న 9,136 మత్స్యకార్మికుల కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడేండ్లుగా ఆర్థిక భరోసా..

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 120 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 978 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 186 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా.. ఈ సంఘాల్లో 9,136 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. 2016-17లో కేసీఆర్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. మొదటి సంవత్సరం 25 లక్షల చేప పిల్లలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏడేండ్లుగా విజయవంతంగా సాగింది. గడచిన ఏడేండ్లలో 6.63 కోట్ల చేప పిల్లలను ఉచితంగా అందజేయగా.. ఇందుకుగాను రూ.4.40 కోట్ల వరకు నిధులను వెచ్చించింది. ఈ మేరకు 41,753 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తితో రూ.56.59 కోట్ల ఆదాయం ఒనగూరింది. జలాశయాల్లో ఉచితంగా వదులుతున్న బొచ్చ, రాహు, బంగారు తీగ, రొయ్య, ముల్లంగి తదితర చేపలతో మత్స్యకార్మికులు ఏడాది పొడవునా ఉపాధిని పొందుతూ వస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన చేపలు ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అవుతుండగా.. మత్స్యశాఖ అధికారులు మార్కెటింగ్ సౌకర్యం సైతం కల్పించారు. చేప పిల్లలను వేటాడేందుకు వలలు, రవాణా కోసం ద్విచక్ర వాహనాలు, టీవీఎస్ చాంప్ మోపెడ్లు, లగేజీ ఆటోలు, బొలేరో వాహనాలను అందజేశారు. అలాగే మహిళా సహకార సంఘాలకు రుణాలను సైతం విరివిగా అందించడంతోపాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లను నిర్వహించి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం కల్పించిన భరోసాతో జిల్లాలో ఒక్కో మత్స్యకార్మిక సభ్యుడికి కేవలం చేపల విక్రయాల ద్వారానే సగటున రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలకు పైగానే లబ్ధి కలిగింది.

ప్రశ్నార్థకంగా పంపిణీ..

చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో సకాలంలో చేప పిల్లలను పంపిణీ చేస్తారా? లేదా! అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా చేప పిల్లల పంపిణీని జూలైలోనే కంప్లీట్ చేసేవారు. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే ఆగస్టు మొదటి వారంలో ఈ తంతు పూర్తి చేసేవారు. ఇందుకుగాను ప్రభుత్వం ఏప్రిల్ మాసం నుంచే సన్నాహాలు మొదలు పెట్టేది. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో పెంచేందుకు 80ఎంఎం నుంచి 100ఎంఎం సైజు చేప పిల్లలను.. చెరువులు, కుంటల్లో పెంచేందుకు 35ఎంఎం నుంచి 400ఎంఎం సైజులో ఉండే చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసేది. అయితే ఈసారి ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల చేప పిల్లల పంపిణీ సైతం ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మూడోసారైనా ముడిపడేనా..!

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన చేపల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా! అన్న సందిగ్ధత తొలుత నెలకొన్నది. తర్జనభర్జనల తర్వాత ఎట్టకేలకు ఈ పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించి జిల్లాలో 813 చెరువుల్లో 1.93 కోటి చేపపిల్లలను వదిలేందుకు సంకల్పించింది. ఈ మేరకు అధికారులు గత జూలై 10న టెండర్లు పిలిచారు. గుత్తేదార్లు టెండర్ వేసేందుకు ముందుకు రాకపోవడంతో గడువును 23వ తేదీకి పెంచారు. అయినప్పటికీ గుత్తేదార్ల నుంచి స్పందన లేకపోవడంతో గడువును ఆగస్టు 13కు మరోసారి పెంచారు. గత ఏడాది జిల్లాలో సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం నేటికీ చెల్లించలేదు. ఈ కారణంగానే గుత్తేదార్లు టెండర్‌లో పాల్గొనడం లేదని తెలుస్తున్నది. జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి కొంతమేర వరద చేరింది. చేప పిల్లల విడుదలకు ఇదే అనువైన సమయం. అయితే ఆలస్యంగా చేప పిల్లలను వదలడం వల్ల చేపలు ఎదగడానికి ఆలస్యమై మత్స్యకార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికైనా వీలైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకార్మికులు కోరుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో గత ఏడేండ్లలో పంపిణీ చేసిన చేప పిల్లల వివరాలు..

సంవత్సరం	చేపపిల్లల సంఖ్య	వెచ్చించిన నిధులు	ఉత్పత్తి (మె.టన్నుల్లో)	ఆదాయం (లక్షల్లో)
2016-17	10.10లక్షలు	రూ.18 లక్షలు	5,510	రూ.6,451
2017-18	99.74లక్షలు	రూ.63.10లక్షలు	8,100	రూ.10,320
2018-19	27.69లక్షలు	రూ.21.54లక్షలు	3,491	రూ.5,850
2019-20	70.54లక్షలు	రూ.33.06లక్షలు	4,199	రూ.4,006
2020-21	129.05లక్షలు	రూ.70.23లక్షలు	4,305	రూ.5,898
2021-22	169.13లక్షలు	రూ.117.19లక్షలు	6,875	రూ.10,211
2022-23	163.13లక్షలు	రూ.117.19లక్షలు	9,273	రూ.13,862

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీకాలనీ వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వన మహోత్సవానికి ఆయన హాజరై మొక్కలను నాటారు. అనంతరం దోమల నివారణకు సంబంధించిన ఆయిల్ బాల్స్‌ను నిల్వ నీటిలో వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రోడ్లపై నీరు నిలువకుండా, దోమలు పెరగకుండా, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భాగస్వామ్యంతో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్ బి.శరత్ చంద్ర, 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య, డీఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ..

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు కలెక్టర్ శశాంకతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వనస్థలిపురం ఏరియా దవాఖాన వైద్య సిబ్బందితోపాటు పేషెంట్లకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. యాంటీనెటల్‌కేర్, లేబర్ రూమ్, ల్యాబ్, ఫిజియోథెరఫీ వార్డు, ఆసుపత్రి ఆవరణలో ఉన్న సఖీ కేంద్రం, పార్కింగ్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు ఏరియా ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.రాజుయాదవ్, టీఎస్ఎంఐడీసీ అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వనస్థలిపురంలోని ఏరియా దవాఖానను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు, కలెక్టర్ శశాంక

ఉస్మానియాకు ఐఎస్‌వో గుర్తింపు

సుల్తాన్ బజార్, ఆగస్టు 8: ఉస్మానియా మెడికల్ కళాశాలకు ఐఎస్‌వో 9001-2015 గుర్తింపు దక్కింది. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఐఎస్‌వో గుర్తింపు సంస్థ ప్రతినిధి శివయ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్‌కు గురువారం గుర్తింపు పత్రాన్ని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలంగాణలో రెండోసారి ఉస్మానియా మెడికల్ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందడం అభినందనీయమని అన్నారు. కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలు, భద్రతా సామర్థ్యంతో పాటు గ్రీన్ ఎన్విరాన్‌మెంట్‌లో మంచి బోధనను అందిస్తున్నామని అన్నారు. కళాశాలలోని అన్ని స్థాయి ఉద్యోగుల కృషి వలనే కళాశాలకు రెండోసారి ఐఎస్‌వో గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ శంకర్, డాక్టర్ పద్మావతి, ఏడీ డాక్టర్ శ్రీధర్ చారి, మాజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టకీయుద్దీన్ పాల్గొన్నారు.

న్యాయవాద దంపతులపై దాడిని నిరసిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు

రంగారెడ్డి కోర్టులో న్యాయవాదుల నిరసన

ఆర్కేపురం, ఆగస్టు 8 : న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులపై జనగామ అర్బన్ పీఎస్‌లో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్ఐ తిరుపతి, ఇతర పోలీసు సిబ్బంది దాడిని నిరసిస్తూ గురువారం న్యాయవాద దంపతులకు మద్దతుగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది జిల్లా రమణరావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు రెండు రోజుల పాటు విధులు బహిష్కరించి ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. నేడు డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పిలుపునిచ్చారు. దాడి చేసిన పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం, హోంమంత్రి, లా మినిస్టర్, గవర్నర్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, క్రిష్ణ, సైదులు, శేఖర్, హరికుమార్, ఎస్.ఎస్.రావు, శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే.. జీఐఎస్ సర్వే

- నగరమంతా మ్యాపింగ్.. డిజిటల్ బోర్డుతో అనేక ప్రయోజనాలు
- ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దు.. సర్వేకు సహకరించాలి
- బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో/హియాయత్‌నగర్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో జీఐఎస్ సర్వే ఎంతగానో దోహదపడుతుందని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి.. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై వివరించారు. జీఐఎస్‌తో గ్రేటర్ మొత్తాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి.. రికార్డు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు, చిన్నా, పెద్ద రోడ్లు, చెరువులు, సరస్సులన్నీ.. ఇలా సిటీ మొత్తం మ్యాపింగ్ జరుగుతుందన్నారు.

ప్రతి ఇంటికి..

దాదాపు 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల హైదరాబాద్ మహానగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. అందులో 2.7 లక్షల కమర్షియల్ గృహాలు ఉన్నాయన్నారు. జీఐఎస్ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి డిజిటల్ డోర్ నంబర్ ఏర్పాటు చేస్తారని వివరించారు. ప్రతి ఇంటి ఎదుట జీఐఎస్ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఉదాహరణకు తమ కాలనీల్లో ఎక్కడైనా సమస్యలున్నా.. జనన, మరణ ధ్రువీకరణ పత్రం , ఆస్తుల మ్యుటేషన్, ఇతర సేవలను నేరుగా ఇంటి వద్ద నుంచే పొందవచ్చని వివరించారు. విపత్తుల సమయంలో, ప్రమాద ఘటనల్లో ప్రజలు త్వరితగతిన సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా అధికారులు వేగవంతంగా స్పందించి నేరుగా వెళ్లి సేవలు అందించే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు వంటివి కబ్జాలకు గురికాకుండా నిఘా ఉంటుందని కమిషనర్ తెలిపారు.ఇప్పటికే హైదర్‌నగర్, మియాపూర్, చందానగర్, కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్, హయత్‌నగర్ లలో జీఐఎస్ సర్వేను ప్రారంభించామన్నారు. శాటిలైట్, గ్రౌండ్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిసున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 130 చదరపు కిలోమీటర్లలో డ్రోన్ సర్వే పూర్తయిందని, త్వరలో 1,40,020 ప్లాట్స్ డిజిటలైజ్ చేయనున్నట్లు చెప్పారు.

మొత్తం 600 బృందాలు

ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ సర్వేతో అన్ని కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. మొత్తం 600 బృందాలను ఏర్పాటు చేసి, రానున్న 6 నెలల వ్యవధిలోనే సర్వే పూర్తి చేస్తామన్నారు. శాటిలైట్, డ్రోన్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఫిజికల్ సర్వేలో వ్యక్తిగత వివరాలను అడగడం లేదని స్పష్టం చేశారు. ఈ సర్వేతో జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, భవనాలు, చెరువులు, పార్కులు ఎన్ని ఉన్నాయి.. ఇలా ప్రతి సంఖ్య కచ్చితంగా చెప్పే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు..